

మేడారంలో అమ్మవార్లను దర్శించుకున్న మేయర్ పారిజాతారెడ్డి, కార్పొరేటర్లు

కాంగ్రెస్ పాలన సజావుగా సాగేలా చూడమ్మా

● మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సజావుగా సాగేలా ఆశీర్వదించాల్సిందిగా సమ్మక్క, సారలమ్మలను వేడుకున్నట్టు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి తెలిపారు. గురువారం ఆమె కార్పొరేటర్లు రాళ్లగూడెం సంతోషీశ్రీనివాస్ రెడ్డి, పోరెడ్డి పద్మాభాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు పెద్దబావి మౌనికాసుదర్శన్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, చిగిరింత దయారెడ్డి, యశస్వినీరెడ్డి తదితరులతో కలిసి మేడారం వెళ్లి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సమ్మక్క, సారలమ్మకు నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకుని, గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్ల దీవెనలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్టు పారిజాతారెడ్డి పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● హయత్‌నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఉపయోగించుకుని అభివృద్ధిలోకి రావాలని హయత్‌నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి కోరారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించే కార్యక్రమంలో భాగంగా హయత్‌నగర్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ యువజన సంఘం వద్ద ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని పేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రంగారావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

బాటసింగారం రైతుసేవా సహకార సంఘం చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

● డీసీఓకు అందజేసిన 9 మంది డైరెక్టర్లు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బాటసింగారం రైతుసేవా సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డిపై సంఘం డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించారు. ఈమేరకు గురువారం 9మంది మెజార్టీ సంఘం డైరెక్టర్లు తమ సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మానం నోటీసును డీసీవో కార్యాలయంలో అందజేశారు. అనంతరం వారు క్యాంపుకు తరలివెళ్లినట్లు సమాచారం. పాలకవర్గం ఏర్పాటై నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డైరెక్టర్లు చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించారు. మొత్తం 13 మంది డైరెక్టర్లకు గాను 9 మంది డైరెక్టర్లు చైర్మన్ విఠల్‌రెడ్డిపై వ్యతిరేకంగా ఉన్నారు. పార్టీలకతీతంగా చైర్మన్‌పై 9 మంది సభ్యులు సంతకాలు చేయడం విశేషం. చైర్మన్ విఠల్‌రెడ్డి ఆగడాలను భరించలేకనే సొంత పార్టీ డైరెక్టర్లు సైతం అవిశ్వాస నోటీసులపై సంతకాలు చేయడం ఆశ్చర్యం కలిగించే విషయం. మొత్తం 13 మంది సంఘం డైరెక్టర్లలో ఇటీవలే ఒకరు మృతి చెందగా, ప్రస్తుతం 12 మంది డైరెక్టర్లు ఉన్నారు. 9 మంది క్యాంపునకు వెళ్లగా చైర్మన్ వెంట కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. క్యాంపునకు వెళ్లిన వారిలో పార్టీలకతీతంగా కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, చేగూరి భరత్, గంట శ్రీనివాస్‌రెడ్డి, ఇటుకల మహేందర్‌రెడ్డి, లక్ష్మమ్మ, నార్లకొండ మల్లమ్మ, బాలనర్సింహ, మొగుళ్ల యాదిరెడ్డి, రాములు ఉన్నారు. చైర్మన్ విఠల్‌రెడ్డి వెంట కేవలం మహిపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి మాత్రమే ఉన్నారు. కాగా డీసీవో కార్యాలయం నుంచి సంఘం డైరెక్టర్లకు నోటీసులు అందజేసిన అనంతరం చైర్మన్‌పై అవిశ్వాస పరీక్ష కోసం ప్రత్యేక సమావేశం తేదిని అధికారులు ప్రకటించనున్నారు.

ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లకు త్రైమాసిక ప్రగతి చక్ర పురస్కారాలు

చాదర్‌ఘాట్. ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో భాగస్వాములై, ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తూ కేఎంపీఎల్ సాధనతోపాటు ఆదాయాన్ని పెంచుతున్న డ్రైవర్, కండక్టర్లకు త్రైమాసిక ప్రగతి చక్ర పురస్కారాలతో సత్కరిస్తున్నట్లు సంస్థ గ్రేటర్ జోన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ పురుషోత్తం తెలిపారు. గురువారం సాయంత్రం దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్-2 డిపోలో జరిగిన రంగారెడ్డి రీజియన్ ప్రగతి చక్ర పురస్కారాల ప్రదానం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడారం జాతరకు అవసరమైనన్ని బస్సులను నడపడంలో డ్రైవర్లు, కండక్టర్లు తమ వంతు సహకారాన్ని అందించి విజయవంతం చేయాలని కోరారు. రంగారెడ్డి రీజినల్ మేనేజర్ ఎ.శ్రీధర్ మాట్లాడుతూ సిబ్బంది, అధికారుల సమిష్టి కృషితోనే సంస్థ అభివృద్ధి జరుగుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంలు సరిరామ్, రాజు, హైదరాబాద్-2 డీఎం కృష్ణమూర్తితోపాటు పలువురు డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌జామ్ సమస్యను పరిష్కరించాలని వినతి



ఎల్బీనగర్ ట్రాఫిక్ ఏసీపీ నవీన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గ్యారగోని ప్రవీణ్‌గౌడ్

చంపాపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌సాగర్ ప్రధాన రహదారిపై వివిధ ప్రాంతాలలో నెలకొన్న ట్రాఫిక్ జామ్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎల్బీనగర్ ట్రాఫిక్ ఏసీపీ నవీన్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గ్యారగోని ప్రవీణ్ గౌడ్ వినతిపత్రం అందజేశారు. కర్మన్‌ఘాట్ చౌరస్తాలో వైన్‌షాప్ వద్ద యూటర్న్ ఉండటంతో తరచూ వాహనాలు ట్రాఫిక్ జామ్ అవుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా కర్మన్‌ఘాట్‌లోని శుభం ప్యాలెస్ ముందు వాహనాలు నిలుపుతుండటంతో ట్రాఫిక్‌జామ్‌తో పాటు దుర్గానగర్ కాలనీ ఆర్చి ముందు రత్నదీప్ వద్ద విద్యార్థులు ఆన్‌లైన్ పరీక్షల సందర్భంగా భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుందని ఆయన ఏసీపీ దృష్టికి తీసుకెళ్లారు. ట్రాఫిక్ జామ్ కాకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రవీణ్‌గౌడ్ ఏసీపీని కోరారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్, సురేష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

మన్సూరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డివిజన్‌లోని కాస్మోపాలిటన్ కాలనీ, విఠల్ ఎన్‌క్లేవ్, శ్రీరాంనగర్ కాలనీల్లో సీసీ రోడ్ల పనులను కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కాలనీవాసులకు ఇచ్చిన హామీలను దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి పనిచేస్తున్నానన్నారు. అనంతరం మధురానగర్‌లో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో భూపాల్‌రెడ్డి, కొప్పుల ఉపేందర్‌రెడ్డి, సత్తయ్య, జగదీశ్‌యాదవ్, ఖాసీం, శ్రీనివాస్ రావు, రమేష్, శంకర్, రాజయ్య పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై ముసారాంబాగ్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు భువనగిరి చంద్రశేఖర్, ముప్పిడి ధన్వంత్, సునీతపత్తితో కలిసి మలక్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాల్క సుమన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

- చాదర్‌ఘాట్,ఆంధ్రజ్యోతి

అక్రమ నిర్మాణాల జోలికి వెళ్లకండి..!

- ● మున్సిపల్ అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధుల హుకుం
- ● కలెక్టర్ ఆదేశాలతో అక్రమ నిర్మాణాలను అడ్డుకున్న అధికారులు
- ● శివారు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో దుస్థితి, అయోమయంలో అధికారులు



పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కార్యాలయం (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా ప్రతినిధుల భర్తలదే పైచేయిగా మారింది. తమ వార్డుల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాల జోలికి వెళ్లొద్దంటూ మున్సిపల్ అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలిసింది. అక్రమ వసూళ్లకు అలవాటుపడిన పలువురు స్థానిక ప్రజాప్రతినిధుల తీరు మున్సిపాలిటీలో చర్చనీయాంశంగా మారింది.

పనులు ఆపిన సిబ్బందిపై దుర్భాషలు

పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఈనెల 1వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన "అందరికీ ఫిక్స్" కథనం మున్సిపాలిటీలో చర్చనీయాంశం అయింది. గత ఏడాది కాలంగా అక్రమ నిర్మాణాల జోలికి వెళ్లని మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించారు. పలు వార్డుల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను మున్సిపల్ కమిషనర్ నేరుగా సిబ్బందితో వెళ్లి అడ్డుకున్నారు. అక్రమ నిర్మాణాలను అధికారులు నిలిపివేయడంతో... పెద్ద ఎత్తున డబ్బులు ముట్టజెప్పిన నిర్మాణదారులు స్థానిక ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో పెద్ద ఎత్తున దండుకున్న ప్రజాప్రతినిధులు మున్సిపల్ ఉన్నతాధికారితో పాటు టౌన్‌ప్లానింగ్ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాల జోలికి వెళ్లొద్దంటూ తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలిసింది.

తమకు సమాచారం ఇవ్వకుండా ఎలాంటి అక్రమ నిర్మాణ పనులను అడ్డుకోవద్దని అధికారులకు హుకుం జారీచేసినట్లు సమాచారం. జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలతో నాలుగు రోజుల కిందట కుంట్లూర్‌లోని అక్రమ సెల్లార్ నిర్మాణంతోపాటు పలు వార్డుల్లో నిలిపివేసిన పనులు తిరిగి కొనసాగుతుండటమే ఇందుకు నిదర్శనం. జిల్లా కలెక్టర్ ఆదేశాలను సైతం లెక్కచేయకుండా అక్రమ నిర్మాణదారులకు అండగా నిలబడటం ఆశ్చర్యం కలిగించే విషయం. కమిషనర్ ఆదేశాలతో అక్రమ నిర్మాణాలను ఆపేందుకు వెళ్లిన టౌన్‌ప్లానింగ్ సిబ్బందిపై స్థానిక ప్రజాప్రతినిధులు దుర్భాషలాడుతున్నారని పలువురు సిబ్బంది తెలిపారు. ఇక మున్సిపాలిటీ పరిధిలో మహిళా ప్రజాప్రతినిధుల షాడోల పెత్తనం అడ్డుఅదుపు లేకుండా పోయింది. ఇప్పటికైనా ఈ విషయాలపై మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

త్వరలో ఎఫ్‌టీఎల్ సమస్యకు పరిష్కారం : ఎమ్మెల్యే



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు

ఎల్బీనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): లింగోజిగూడ డివిజన్‌లోని గ్రీన్‌పార్క్‌కాలనీ ఎఫ్‌టీఎల్ సమస్య త్వరలో పరిష్కారమవుతుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చెప్పారు. డివిజన్ పరిధిలోని రూ.కోటి ఇరవై ఏడు లక్షలతో చేపట్టనున్న గ్రీన్‌పార్క్ కాలనీలో సీసీ రోడ్డు పనులు, శ్రీరాంనగర్‌లో కమ్యూనిటీహాల్ పనులకు కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్‌పార్క్ కాలనీ ఎఫ్‌టీఎల్ సమస్యను వారం రోజుల క్రితం కలెక్టర్‌తో జరిగిన సమావేశంలో వివరించడం జరిగిందన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే ఒక పరిష్కారం లభిస్తుందని ఆయన చెప్పారు. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. శంకుస్థాపన చేసిన పనులను వెంటనే ప్రారంభించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ లింగోజిగూడ డివిజన్ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, మాజీ ఫ్లోర్‌లీడర్ చిత్తలూరి వెంకటేశ్వర్లు, తిలక్‌రావు, ఆశీష్, రాకేష్, వెంకట్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు జగన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, మధుసూదన్, అంజయ్యగౌడ్, రామచందర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు ఎన్నో అవకాశాలు



మాట్లాడుతున్న కరుణగోపాల్

మన్సూరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు వంటింటికే పరిమితం కాకుండా వ్యాపారాలు చేసేందుకు వారికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని 'మహిళా బీజేపీ పాలసీ, రీసెర్చ్' విభాగం జాతీయ ఇన్‌చార్జి కరుణగోపాల్ పేర్కొన్నారు. మహిళలకు వ్యాపార అవకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం బండ్లగూడలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కరుణగోపాల్ మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. మహిళలు అంత్రప్రెన్యూర్‌గా ఎదగాలన్నది మోదీ ఆశయమన్నారు. ప్రపంచంలో ఐదో పెద్ద జీడీపీ దేశంగా భారత్ ఎదిగిందని, మహిళలందరూ కూడా తమ శక్తిని ఉపయోగిస్తే 27 శాతం జీడీపీ పెరుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా 20 లక్షల మంది మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్ మీద మోదీ ప్రభుత్వం శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్నదన్నారు. తాము మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో మహిళలకు అవగాహన కల్పిస్తున్నామని, వారిని పారిశ్రామిక వేత్తలుగా తయారు చేసేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. అవగాహన కల్పించటంతో పాటు ఇండస్ట్రియల్ టూర్లకు తీసుకెళ్లి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అంత్రప్రెన్యూర్‌గా ఎదిగే వారికి కోవే సంస్థ బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తుందన్నారు. కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజర్ కాలంశెట్టి లయ, కోవే సంస్థ ప్రతినిధులు జ్యోత్స్న చందు, కల్పన శర్మ, బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర కార్యదర్శి శ్యామల, వీణ, సుజాత, సాయిసుధ పాల్గొన్నారు

కాంగ్రెస్ బలిజగూడ గ్రామశాఖ కమిటీ నియామకం



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం తీసుకుంటున్న గ్రామశాఖ అధ్యక్షుడు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బలిజగూడ గ్రామం కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా ఉప్పు రాకేష్, కార్యదర్శిగా ఉప్పు పవన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా అధ్యక్ష, కార్యదర్శులు నియామకపత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌గౌడ్, వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్, బల్లెపు సతీష్‌కుమార్, సాయి, భరత్ తదితరులు పాల్గొన్నారు.



విజేతను సన్మానిస్తున్న ఉపేందర్‌రెడ్డి, సుధాకర్‌చారి తదితరులు

యువ క్రీడాకారులను ప్రోత్సహించాలి

● యువజన కాంగ్రెస్ నేత ఉపేందర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): యువ క్రీడాకారులను ప్రోత్సహించడం వల్ల వారిని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దవచ్చని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని అల్కాపురి భవన్‌లో ఎస్సార్‌ఎం వర్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ జాతీయ స్థాయి ఓపెన్ క్యారమ్ టోర్నమెంట్స్‌లో విజేత ఆదిత్యను ఘనంగా సన్మానించారు. ఈ పోటీలలో నేషనల్ ఛాంపియన్ కె.శ్రీనివాస్‌తో జరిగిన ఫైనల్స్‌లో తెలంగాణ రాష్ట్ర క్యారమ్స్ ఛాంపియన్ ఎస్.ఆదిత్య ఘన విజయం సాధించారు. గురువారం ఉపేందర్‌రెడ్డి ఆదిత్యను అభినందించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగోల్ సుధాకర్‌చారి, భరద్వాజ, రామచంద్రారెడ్డి, రాజగోపాల్, వినయ్, విజయ్, వంగాల శ్రీకాంత్‌రెడ్డి, పగిళ్ల పురుషోత్తం, విప్లవ్, సంతోష్, ప్రభ, రాము తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి రక్షణ కల్పించాలి

● కోరళ్ల కృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బాధితుడు కోరళ్ల కృష్ణారెడ్డి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): భూకబ్జాలకు పాల్పడుతూ దాడులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరళ్ల కృష్ణారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కబ్జాను అడ్డుకున్నందుకు తనపై హత్యాయత్నం చేశారని, తప్పించుకోవడంతో గాయాలతో బయటపడ్డానని తెలిపారు. ఇందులో ఖమ్మం జిల్లాకు చెందిన బిలిఫ్ ఆస్పత్రి ఎండీ రమాజ్యోతి పాత్ర ఉందని ఆరోపించారు. భూకబ్జాదారుల నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

పహాడిషరీఫ్ పీఎస్ పరిధిలోని బాసగూడ తండా వద్ద తనకు ఎకరం 21గుంటల భూమి ఉందని, కొంత భూమిని రమాజ్యోతి బంధువు కబ్జా చేయడానికి ప్రయత్నించాడని, తాను అడ్డుకోవడంతో మారణాయుధాలతో దాడి చేయించారన్నారు. పహాడిషరీఫ్ ఎస్‌ఐ కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని, దీని వెనుక మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాత్ర ఉందని ఆరోపించారు. మహేశ్వరం మండలం, కొంగరకుర్దు గ్రామ రెవెన్యూ పరిధిలో 8 ఎకరాల 24 గుంటల భూమిని జెల్లల లక్ష్మయ్య తనకు విక్రయించాడని, ఇదే భూమిని మరొకరికి డబుల్ రిజిస్ట్రేషన్ చేశాడని, ఇదేమిటని ప్రశ్నిస్తే భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీని వెనుక మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అనుచరుల పాత్ర ఉందన్నారు. 285 సర్వే నెంబర్‌లోని 3 ఎకరాల భూమిని కూడా రవీందర్‌రెడ్డి తనకు విక్రయించారని, ఈ భూమిని ఆక్రమించడానికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అండదండలతో కొంతమంది భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. కబ్జాపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడంలేదన్నారు. కబ్జాదారులకు అండగా నిలుస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



పారిశుధ్య కార్మికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

పరిశుభ్రత బాధ్యత పారిశుధ్య కార్మికులదే

● బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

వనస్థలిపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కాలనీలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత పారిశుధ్య కార్మికులదే అని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో కార్పొరేటర్ లచ్చిరెడ్డి పారిశుధ్య కార్మికుల పనితీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలు, రోడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అదేవిధంగా కాలనీవాసులు తమ ఇంటి పరిసరాల్లో చెత్త వేయకుండా, చెత్తను చెత్త రిక్షాలోనే వేసి కాలనీలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్‌గా సైదయ్య



ఇన్‌స్పెక్టర్ సైదయ్య

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా సైదయ్య గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేసిన మన్మోహన్‌యాదవ్ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో యాచారం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సైదయ్యను అబ్దుల్లాపూర్‌మెట్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా నియమిస్తూ రాచకొండ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సైదయ్య మాట్లాడుతూ శాంతిభద్రతల సంరక్షణ కోసం తనవంతు కృషి చేస్తానన్నారు.

గృహజ్యోతి సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

● కార్పొరేటర్ మాధవీ ఈశ్వర్‌గౌడ్

సరూర్‌నగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టదలచిన గృహజ్యోతి (200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్) పథకంపై ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది నిర్వహిస్తున్న సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మీర్‌పేట్ 45వ డివిజన్ కార్పొరేటర్ అక్కి మాధవీఈశ్వర్‌గౌడ్ కోరారు. గురువారం డివిజన్ పరిధిలోని కాలనీల్లో ట్రాన్స్‌కో సిబ్బందితో కలిసి ఆమె వినియోగదారుల ఇళ్లకు వెళ్లి పథకంపై అవగాహన కల్పించారు. దరఖాస్తుదారుల ఇంటికి సిబ్బంది రాకపోతే తన దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు.

కూచిపూడి నాట్యంలో బేబీ శాన్వీశ్రీకి జాతీయ ఉత్తమ ద్వితీయ అవార్డు



జాతీయ అవార్డును సాధించిన బేబి శాన్వీశ్రీ

వనస్థలిపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆర్ట్ అండ్ కల్చర్ మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ సంస్థ నిర్వహించిన 10వ జాతీయ డ్యాన్స్ కాంపిటీషన్ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బేబి శాన్వీశ్రీ జాతీయ స్థాయి ఉత్తమ ద్వితీయ బహుమతిని సాధించింది. ఈ సందర్భంగా జాతీయ ఉత్తమ అవార్డు పొందడానికి కృషి చేసిన ఎస్కేఎస్ కళాక్షేత్రం డ్యాన్స్ అండ్ మ్యూజిక్ స్కూల్ గురువులు డాక్టర్ మనోజ్ఞ, డాక్టర్ కృష్ణకుమారి, డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, డాక్టర్ పసుమర్తి శేషుబాబు తదితరులకు శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా రుద్రగౌని వెంకట్‌ప్రసాద్



రుద్రగౌని వెంకటప్రసాద్

చంపాపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా చంపాపేటకు చెందిన రుద్రగౌని వెంకటప్రసాద్ నియమితులయ్యారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి చేతుల మీదుగా గురువారం ఆయన నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటప్రసాద్ మాట్లాడుతూ తనను పదవిలో నియమించినందుకుగాను సీఎం, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో హోటల్ కార్మికుడు మృతి

సైదాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో హోటల్ కార్మికుడు భవనంపై నుంచి పడి మృతి చెందాడు. చత్తీస్‌ఘడ్‌కు చెందిన లలిత్(25), నయన దంపతులు వలస వచ్చి చంపాపేటలోని ఓ లాడ్జిలో పని చేస్తున్నారు. ఆ భవనం పెంట్‌హౌజ్‌లో మరదలితో కలిసి వీరు నివాసముంటున్నారు. లలిత్ బుధవారం రాత్రి తాగి వచ్చి పడుకున్నాడు. ఉదయం లేచి చూడగా భవనంపై నుంచి కిందపడి మృతి చెంది ఉండటాన్ని భార్య, మరదలు గమనించారు. వెంటనే లాడ్జి సిబ్బందికి చెప్పి అక్కడి నుంచి ఇద్దరు భయంతో పారిపోయారు. సమాచారమందుకున్న సైదాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మధ్యాహ్నం భార్య, మరదలు తిరిగి రావడంతో వారిని పోలీసులు విచారిస్తున్నారు. తాము భయంతో పారిపోయినట్లు చెప్పినట్లు వారు తెలిపారు. .